పచ్చని ప్రకృతి ఒడిలో స్వేచ్ఛగా సంచరించాల్సిన పక్షులు ఆహారం కోసం గ్రామాలకు వస్తున్నాయి. వాటికి ఆహారం లభ్యమైన ప్రాంతంలోకి వచ్చి వాలుతున్నాయి. చందూర్ మండల కేంద్రంలోని ఓ రైస్‌మిల్లు వద్ద నిల్వ ఉంచిన ధాన్యం బస్తాలపై గురువారం సాయంత్రం వందల సంఖ్యలో చిలుకలు వచ్చి వాలగా.. ఈ దృశ్యాన్ని అటుగా వెళ్తున్నవారు ఆసక్తిగా తిలకించారు.

–చందూర్, జనవరి 18

ఆర్మూర్‌లో ఓ ప్రైవేట్ ఈఎన్‌టీ దవాఖానను సీజ్ చేస్తున్న వైద్యాధికారులు (ఫైల్)

మళ్లీ శంకుస్థాపనలా?

ధర్పల్లి, జనవరి 18 : నిజామాబాద్ రూరల్ ప్రాంతంలోని పలుచోట్ల గత ప్రభుత్వంలో పనిచేసిన మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ శంకుస్థాపన చేసిన అభివృద్ధి పనులకే రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి పునఃశంకుస్థాపన చేయనున్నట్లు తెలిసింది. దీనిపై ప్రజలు ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు. ఇందల్వాయి మండలంలోని వెంగల్‌పాడ్ గ్రామంలో నిజామాబాద్–ధర్పల్లికి వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు మొరగు వాగుపై హెచ్‌ఎల్‌బీ వంతెన, ఎల్లారెడ్డిపల్లి గ్రామ పరిధిలోని ఆర్‌అండ్‌బీ రోడ్డు లింగాపూర్ వాగుపై హెచ్‌ఎల్‌బీ వంతెన, ధర్పల్లి మండలంలోని మద్దుల్–గడ్కోల్ ఆర్‌అండ్‌బీ రోడ్డు ముత్యాల వాగుపై హెచ్‌ఎల్‌బీ వంతెన, గడ్కోల్ గ్రామంలో కప్పలవాగుపై హెచ్‌ఎల్‌బీ వంతెనకు ఎమ్మెల్యే భూపతిరెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేయనున్నట్లు సమాచారం. రూరల్ ప్రాంత అభివృద్ధిలో భాగంగా మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ గత ప్రభుత్వ హయాంలో సీఎం కేసీఆర్, మంత్రులను ఒప్పించి అభివృద్ధి పనులకు ఎన్నికలకు ముందుగానే శంకుస్థాపన చేశారు. ఎన్నికల కోడ్ రావడంతో పనులు చేపట్టలేదు. ఇప్పుడు మళ్లీ వాటికే శంకుస్థాపన చేయనుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. శంకుస్థాపనలు చేసిన వాటికే తిరిగి శంకుస్థాపనలు చేయకుండా, నూతనంగా అభివృద్ధి పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సిగ్గుచేటు : ఇందల్వాయి ఎంపీపీ రమేశ్ నాయక్

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో వెంగల్‌పాడ్, ఎల్లారెడ్డిపల్లి వంతెన నిర్మాణాలకు మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ శంకుస్థాపన చేశారని, మళ్లీ అదే పనులకు ప్రస్తుత ఎమ్మెల్యే భూపతిరెడ్డి శంకుస్థాపన చేయనుండడం సిగ్గుచేటని ఇందల్వాయి ఎంపీపీ రమేశ్ నాయక్ అన్నారు. ఇందల్వాయిలో గురువారం విలేకరులతో మాట్లాడుతూ కొత్త పనులకు నిధులు తేకున్నా.. బాజిరెడ్డి నిధులు మంజూరు చేసి పనులకు శంకుస్థాపన చేస్తే తిరిగి వాటికే శిలాఫలకాలు వేయడం విడ్డూరంగా ఉన్నదన్నారు. ఇకనైనా శంకుస్థాపనలను మానుకోవాలని సూచించారు.

కలెక్టర్‌కు బాజిరెడ్డి ఫిర్యాదు

శంకుస్థాపన చేసిన పనులకు మళ్లీ శంకుస్థాపనలు చేయనుండడంపై మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ గురువారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఇది రాజ్యాంగ విరుద్ధమని బాజిరెడ్డి పేర్కొన్నారు.

ప్రైవేట్ వైద్యం! ప్రాణాలతో చెలగాటం

- జిల్లాలో పర్మిషన్ లేకుండానే హాస్పిటళ్ల నిర్వహణ
- నకిలీ వైద్యులు.. నిబంధనలు పాటించని యాజమాన్యాలు
- ఏండ్లుగా కానరాని అధికారుల తనిఖీలు
- ప్రస్తుతం హఠాత్తుగా చేపడుతున్న పైపై దాడులు
- తనిఖీల తీరుపై వ్యక్తమవుతున్న అనుమానాలు

సేవల రంగంగా పేరొందిన వైద్యం కొందరి వల్ల ఫక్తు వాణిజ్య రంగంగా మారుతున్నది. పుష్కలంగా డబ్బులుంటే చాలు లాభసాటి వ్యాపారంగా ఓ దవాఖానను ఏర్పాటు చేసి అందినకాడికి దండుకుంటున్నారు. వైద్యంపై ఎలాంటి అవగాహన లేకపోయినా మల్టీ స్పెషాలిటీ దవాఖానలకు యజమానులుగా మారిపోతున్నారు. డాక్టర్ కోర్సు చేసినవారిని ఆసరాగా చేసుకొని 'వైద్య' వ్యాపారం చేస్తున్నారు. ప్రైవేట్ దవాఖానల్లో వైద్యుల అర్హత విషయం దేవుడెరుగు.. ఎప్పుడైన వైద్యం వికటించి ఎవరి ప్రాణాలమీదికైనా వస్తే చూసుకుందాంలే అన్నట్లుగా మారింది పరిస్థితి.

–నిజామాబాద్, జనవరి 18, (నమస్తే తెలంగాణ ప్రతినిధి)



వైద్యారోగ్య శాఖలో అంతులేని నిర్లక్ష్యం..

వాస్తవానికి ఒక దవాఖానను ఏర్పాటు చేయాలంటే అదో ప్రహసనం. అనుమతుల విషయం పక్కన పెడితే ..అనుమతి లేకుండా ఏర్పాటయ్యే హాస్పిటల్స్‌కైనా నెలల సమయం పడుతుంది. ప్రారంభోత్సవాల అనంతరం దవాఖానలో రోగుల సందడి, ఓపీ(ఔట్ పేషెంట్), ఐపీ(ఇన్ పేషెంట్) రద్దీతోనైనా వైద్యారోగ్య శాఖకు సమాచారం టక్కున వెళ్తుంది. ఈ విషయం తెలిసిన వెంటనే రంగంలోకి దిగి గుర్తింపు లేని దవాఖానల భరతం పడితే ప్రజలకు మంచి జరుగుతుంది. కానీ అలాకాకుండా అలాంటి దవాఖాల అక్రమాలు,ఆగడాలను ఏడాది కాలంగా చూస్తూ.. అకస్మాత్తుగా గుర్తింపు లేని దవాఖానలను మూసేయడం వెనుకున్న రహస్యం ఏమిటో ఎవరికీ అర్థం కాని అంశం.

బోగస్ దవాఖానలు, నకిలీ వైద్యులు..

వైద్యారోగ్య శాఖలోని ఓ అధికారి ఆశీస్సులతో ఎడాపెడా నిజామాబాద్, బోధన్, ఆర్మూర్‌లో నకిలీ డాక్టర్లు, బోగస్ దవాఖానలను నిర్వహిస్తున్నారు. వీటిపై ఫిర్యాదులు అందినా వాటి జోలికి మాత్రం పోని సదరు శాఖకు చెందిన అధికార గణం..అకస్మాత్తుగా ఆర్మూర్‌లో రెండు దవాఖానలను మూసేయడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వారి పనితనం మరోసారి ప్రస్ఫుటంగా బట్టబయలైంది. మూసేసిన ఈఎన్‌టీ దవాఖానలు చాలా రోజులుగా నడుస్తున్నప్పటికీ ఇప్పటి వరకు వాటి జోలికి వెళ్లకపోవడం చర్చకు దారి తీసింది. నిజామాబాద్ నగరంలోని అర్సపల్లిలోనూ నిబంధనలకు విరుద్ధంగా ఓ పీఎంపీ వ్యవహారమూ ఇలాగే ఉంది. ఆలస్యంగా డీఎంహెచ్‌వో బృందాలు స్పందించడం ఎవ్వరికీ అర్థం కావడం లేదు. ఆర్మూర్‌లో డిప్యూటీ డీఎంహెచ్‌వో స్థాయి అధికారి ఉన్నప్పటికీ.. వారికి ఈ అక్రమ వైద్య దందా కనిపించక పోవడం విడ్డూరంగా మారింది. జిల్లాలో ఈ తరహా తంతుపై తనిఖీలు సీరియస్‌గా చేపడితే మరిన్ని దవాఖానల బాగోతాలు వెలుగు చూస్తాయని ప్రజలు భావిస్తున్నారు. చాపకింద నీరులా మారిన వీటిని మూసేయాలని కోరుతున్నారు.

అధికారుల ఉదాసీన వైఖరి..

జిల్లాలో ధనార్జనే ధ్యేయంగా సాగుతున్న వైద్య వ్యాపారంలో ఎన్నో లోసుగులు, అక్రమాలు బహిర్గతమవుతున్నా.. సంబంధిత శాఖ ఉదాసీనంగా వ్యవహరించడం గమనార్హం. పర్యవేక్షించాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడం విమర్శలకు దారి తీస్తున్నది. ఫిర్యాదులు అందినా ఆఫీస్ నుంచి కాలు బయట పెట్టకుండానే మమ అనిపించడం, మామూళ్ల మత్తులో మునిగి తేలడం రివాజుగా మారింది. దీంతో అక్రమార్కుల వైద్య దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతున్నది. వైద్యారోగ్య శాఖలో ఇంటి దొంగల తీరుతో ఆ శాఖకు మాయని మచ్చగా మిగుతోంది. ఇన్‌చార్జి అధికారి ఆగడాలు ఓ వైపు, మరోవైపు వరుస ఏసీబీ కేసులతో పరువు పోగొట్టుకున్న వైద్యారోగ్య శాఖ గుట్టు రోజుకో రూపంలో రట్టు అవుతోంది. కుప్పలు తెప్పలుగా వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో వైద్యారోగ్య శాఖ బృందాలు తనిఖీలు చేపట్టగా నిజామాబాద్ జిల్లాలో పలుచోట్ల గుర్తింపులేని దవాఖానలు వెలుగు చూడడం ఆ శాఖ పనితీరుకు అద్దం పడుతోంది.

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం..

నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే దవాఖానలపై కఠిన చర్యలు తీసుకుంటాం. అర్హత లేని డాక్టర్లతో వైద్య సేవలు అందించినా తప్పే. ప్రజలకు ఇబ్బందులు సృష్టించే వారిపై చర్యలు ఉంటాయి. ప్రజలెవరైనా ఫిర్యాదు చేస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

- సుదర్శనం, డీఎంహెచ్‌వో, నిజామాబాద్

డీఎంహెచ్‌వోలో లీకువీరులు

నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో ప్రైవేటు వైద్య రంగం వైద్యో నారాయణ హరి అన్న నానుడిని తిరగేసి.. కమీషన్ల వ్యవస్థను ప్రవేశ పెట్టి రోగులను ఆదాయ వనరుగా మారుస్తున్నారు. రోగి అనారోగ్య పరిస్థితిని అంచనా వేసి ఇష్టానుసారంగా దోచుకుంటున్నారు. మల్టీ స్పెషాలిటీలు, కార్పొరేట్ వైద్యం పేరుతో రోగులకు చుక్కలు చూపిస్తున్నాయి. కాసులకు కక్కుర్తి పడి రోగుల ప్రాణాలను సైతం పణంగా పెడుతున్నాయి. నడుము నొప్పితో బాధపడుతున్న ఓ వ్యక్తి నిజామాబాద్‌లో ఓ వైద్యుడి వద్దకు వెళ్లగా సర్జరీకి సిఫార్సు చేశాడు. ఆపరేషన్‌తో ఇబ్బందులు తప్పవని గ్రహించిన సదరు వ్యక్తి ఏకంగా హైదరాబాద్‌కు వెళ్లడంతో నడుపు నొప్పి కాస్త మందులతోనే తగ్గి పోయింది. ఇలాంటి ఘటనలకు నిజామాబాద్ కేంద్రంగా మారింది. చేయి ముడితే శస్త్ర చికిత్సలు, కోకొల్లలుగా టెస్టులతో రోగిని నిలువుదోపిడీ చేస్తున్నప్పటికీ వైద్యారోగ్య శాఖ పట్టించుకోకపోవడం దురదృష్టకరం. నిరంతర తనిఖీలు చేపట్టాల్సిన అధికారులు.. యాజమాన్యాలతో చెట్టాపట్టాలేసుకుని తిరగడం ఇందుకు కారణమని తెలుస్తోంది. ఫిర్యాదులు వస్తే కూడా ముందే ప్రైవేటు దవాఖాన యాజమాన్యాలకు లీకులు ఇచ్చిన ఘనాపాఠీలు వైద్యారోగ్య శాఖలో ఉన్నారు. లీకువీరులపై గత కలెక్టర్ నారాయణ రెడ్డి సీరియస్‌గా వార్నింగ్ కూడా ఇచ్చారు. పాత కలెక్టర్ బదిలీ తర్వాత లీకువీరులకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. కొన్ని దవాఖానలకు అనుమతులు లేకున్నా రోగుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుంటున్నాయి. వైద్య వృత్తిపై కనీ స పరిజ్ఞానం లేని వారితో పాటు వ్యా పారమే పరమావధిగా భావిస్తున్న కొందరు వైద్యులు నడుపుతున్న దవాఖానల్లో పరిస్థితి గందరగోళంగా మారింది.

ముద్ర రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

బొంకన్‌పల్లిలో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

మాక్లూర్, జనవరి 18: కేంద్ర ప్రభుత్వం బ్యాంకుల ద్వారా అందజేస్తున్న ముద్ర రుణాలను చిరు వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని నిజామాబాద్ జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. మండలంలోని బొంకన్‌పల్లి గ్రామంలో గురువారం నిర్వహించిన 'వికసిత్ భారత్ సంకల్పయాత్ర' కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జైక్రాంతి, సర్పంచ్ సాయమ్మ, ఉపసర్పంచ్ సాంగి గంగాధర్ కుర్మ, ఎంపీటీసీ పూజిత, ఏవో పద్మ, ఏపీవో ఓంకార్, ఏపీఎం అనిల్‌కుమార్, సూపర్ వైజర్ శ్రీప్రియ, బ్యాంకు మేనేజర్లు, వైద్యాధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆయకట్టు సంబరం

- సాగర్ నుంచి కొనసాగుతున్న మూడో విడుత నీటి విడుదల
- యాసంగి సాగులో నిమగ్నమైన రైతాంగం



నిజాంసాగర్, జనవరి 18: నిజాంసాగర్ ఆయకట్టు కింద రైతులు సాగు పనుల్లో బిజీబిజీగా మారారు. రిజర్వాయర్‌లో పుష్కలంగా నీరు ఉండడంతో సాగుకు ఎలాంటి ఢోకా లేదనే ధీమాతో ముందుకు సాగుతున్నారు. మొదటి ఆయకట్టు రైతులు వరినాట్లలో నిమగ్నమయ్యారు. నిజాంసాగర్, బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలాలకు చెందిన రైతులు ఉత్సాహంగా పంటలు పండిస్తున్నారు. మరోవైపు నిజాంసాగర్ ఆయకట్టు కింద ఉన్న లక్షా 25వేల ఎకరాల ఆయకట్టుకు ప్రాజెక్టు ప్రధాన కాలువ ద్వారా ప్రస్తుతం మూడో విడుత నీటి విడుదల కొనసాగుతున్నది.

సాగర్‌లో పుష్కలంగా నీరు..

నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 1405.00 అడుగులు (17.80 టీఎంసీలు) కాగా, ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1401.30 అడుగులు (12.83 టీఎంసీలు) నీరు నిల్వ ఉన్నది. ఏడు రోజులుగా మూడో విడుత నీటి విడుదల కొనసాగుతున్నది. నవంబర్‌లో 15 రోజులపాటు మొదటి విడుత, డిసెంబర్‌లో రెండో విడుత కింద 2.95 టీఎంసీల నీటిని ఆయకట్టుకు విడుదల చేయగా ప్రస్తుతం మూడో విడుత నీటిని విడుదల చేస్తున్నారు. ఆయకట్టు పంటలు గట్టెక్కేందుకు మొత్తం ఆరు విడుతల్లో నీటిని విడుదల చేయనున్నట్లు ఏఈ శివప్రసాద్ తెలిపారు. ఆరు విడుతల నీటిని మార్చి నెలాఖరు వరకు మొత్తం 11టీంఎంసీలను విడుదల చేయనున్నారు. నవంబర్‌లో నీటి విడుదలను ప్రారంభించగా కోటగిరి, రుద్రూర్, వర్ని, బోధన్, చందూర్, మోస్రా, ఎడపల్లి మండలాల్లోని రైతులు ముందుగానే వరి నాట్లు వేసుకున్నారు. ప్రస్తుతం మొదటి ఆయకట్టు కింద నిజాంసాగర్, బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలాలకు చెందిన ఆయకట్టు రైతులు వరి నాట్లు వేస్తుండడడంతో ప్రధాన కాలువ ద్వారా 2005 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

తొమ్మిది ఎకరాల్లో నాట్లు వేశా..

ఆయకట్టు కింద ఉన్న తొమ్మిదెకరాల్లో వరి నాట్లు వేశాను. ఆరేండ్లుగా యాసంగి, వానకాలం సీజన్లలో రెండు పంటలను పూర్తిస్థాయిలో సాగు చేస్తున్న. నీటి ఇబ్బందులు లేకుండా సాగు చేస్తుండడం సంతోషంగా ఉన్నది. ఎక్కువ సామర్థ్యంతో నీటిని విడుదల చేస్తుండడంతో చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందుతున్నది. **- శంకర్, రైతు, తున్నిపల్లి**

సాగులో బిజీ..

ఆయకట్టు కింద నీటి విడుదల కొనసాగుతుండడంతో సాగు పనుల్లో బిజీగా ఉన్నాం. నాకు ఐదెకరాల భూమి ఉండగా రెండు పంటలను సాగు చేస్తున్న. కానీ మొదటి ఆయకట్టు కింద ఉన్న భూముల్లో కాస్త అలస్యంగా సాగు చేయడం అలవాటైంది. అయినప్పటికీ పంటలు గట్టెక్కేంత వరకు నీటికి అందిస్తుండడంతో ఎలాంటి ఇబ్బందులూ లేకుండా సంతోషంగా ఉన్నాం. **- గొల్ల రాజు, రైతు, నర్వ**

కక్షతోనే సస్పెండ్ చేయించారు..

- యూత్ కాంగ్రెస్ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు గజానంద్ పాటిల్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గజానంద్ పాటిల్

డోంగ్లీ, జనవరి 18: పదేండ్లపాటు కాంగ్రెస్ జెండా మోశానని, పార్టీ కోసం కష్టపడి పని చేసిన తనను జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు కక్షతోనే సస్పెండ్ చేయించారని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గజానంద్ పాటిల్ ఆరోపించారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ తనకు ఇచ్చిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించానని, ఎన్నికల్లో ఇచ్చిన డబ్బులు, మందు ప్రతి గ్రామశాఖ అధ్యక్షుడికి అందించానని, తాను ఇవ్వలేదని నిరూపిస్తే దేనికైనా సిద్ధమేనని అన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలను గంగారాం వర్గమంటూ పక్కన పెడుతున్నారని, ఇది సమంజసం కాదన్నారు. పార్టీ కోసం పని చేసే వాళ్లను గుర్తించాలని ఆవేదన వ్యక్తంచేశారు. ఆయన వెంట తంబాకే నాగనాథ్ ఉన్నారు. ఇదిలా ఉండగా జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గజానంద్‌పాటిల్ ఎన్నికల్లో పార్టీకి విరుద్ధంగా పనులు చేశారని సస్పెండ్ చేస్తూ యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు సురభీ దివేది ఉత్తర్వులు జారీ చేశారు.

నామినేషన్ దాఖలు



ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ నుంచి మహేశ్‌కుమార్‌గౌడ్ గురువారం నామినేషన్ దాఖలు చేశారు. కార్యక్రమంలో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ తదితరులు ఉన్నారు.

బీజేపీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడిగా దినేశ్

- కామారెడ్డికి అరుణతార కొనసాగింపు
- రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా పెద్దోళ్ల గంగారెడ్డి

దినేశ్ కులాచారి

అరుణతార

వినాయకనగర్/కామారెడ్డి, జనవరి 18: భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులను మారుస్తూ గురువారం పార్టీ రాష్ట్ర కార్యాలయం ఉత్తర్వులు వెలువరించింది. నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగిన బస్వా లక్ష్మీనర్సయ్యను తొలగించి, ఆయన స్థానంలో దినేశ్ కులాచారిని నియమించారు. దినేశ్ కులాచారి ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. బీజేపీ కామారెడ్డి జిల్లా అధ్యక్షురాలిగా అరుణతార కొనసాగనున్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు అధ్యక్షులను మార్చినప్పటికీ కామారెడ్డిలో ఎలాంటి మార్పూ చేపట్టలేదు. రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా నిజామాబాద్ జిల్లాకు చెందిన పెద్దోళ్ల గంగారెడ్డిని నియమించారు.

పలు రైళ్ల పునరుద్ధరణ

సిటీబ్యూరో, జనవరి 18(నమస్తే తెలంగాణ): రైల్వే నిర్వహణ, పలు కారణాలతో రద్దు చేసిన పలు రైళ్లను పునరుద్ధరిస్తూ రైల్వే అధికారులు గురువారం ప్రత్యేక నిర్ణయం తీసుకున్నారు. దాండ్ – నిజామాబాద్, నిజామాబాద్ – పందాపూర్ స్టేషన్ల మధ్య రెండు రైళ్లను పాత టైమ్‌టేబుల్ ప్రకారం యథావిధిగా నడుపనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. అలాగే, ధర్మాబాద్ – మన్మాడ్, ఔరంగాబాద్ – హైదరాబాద్, నాగర్సోల్ – నర్సాపూర్, ముంబై సీఎస్‌ఎంటీ – నాందేడ్, నాందేడ్ – పూణె, కాచిగూడ – నాగర్‌సోల్ స్టేషన్ల మధ్య నిలిచిపోయిన ఆరు రైళ్లను తిరిగి ఈ నెల 20 నుంచి షెడ్యూల్ ప్రకారం నడిపించనున్నామని అధికారులు పేర్కొన్నారు.

* సౌత్ వెస్టన్ రైల్వే జోన్‌కు సంబంధించి నాందేడ్ – బెంగళూరు రైల్వే స్టేషన్ల మధ్య నడిచే రైలును యలహంక – కేఎస్ఆర్ బెంగుళూరు స్టేషన్ల మధ్య పాక్షికంగా రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు.

* న్యూఢిల్లీ – హైదరాబాద్ రైల్వే స్టేషన్ల మధ్య నడుస్తున్న రైలు ఈ నెల 20న రద్దు చేసినట్లు రైల్వే అధికారులు పేర్కొన్నారు.